

చీనీ టన్ను రూ.23 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.23 వేలు పలికాయి.



టమాట కిలో రూ.13

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

గురువారం	శుక్రవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.32	సెహరీ : 5.06



న్యూస్‌రీల్

హెచ్‌టీ పత్తి విత్తనాలు విక్రయిస్తే చర్యలు



విత్తన దుకాణంలో పత్తి విత్తనాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

అనంతపురం సెంట్రల్: నిషేధిత హెర్బిసైడ్ టోలరెన్స్ (హెచ్‌టీ) పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ కమిషనరేట్ ఏడీఏ శ్రీనివాసచార్య హెచ్చరించారు. బుధవారం జిల్లాకు వచ్చిన ఆయన ఏడీఏ ఎం. రవి, టెక్నికల్ ఏఓలు రాకేష్‌నాయక్, శివరామకృష్ణతో కలిసి స్థానికంగా ఉన్న పలు విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. పత్తి విత్తనాలు పరీక్షించారు. ఎక్కడా హెచ్‌టీ రకం లేవని నిర్ధారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌టీ రకం పత్తి విత్తనాలు సరఫరా చేసినా, అమ్మకాలు సాగించినా చర్యలు తీసుకుంటామని డీలర్లకు హెచ్చరికలు జారీ చేశారు.

రూ.12.77 లక్షల నగదు పట్టివేత



స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

తాడిపత్రి అర్బన్: స్థానిక ఆర్టీసీ బస్టాండులో ఓ వ్యక్తి నుంచి రూ.12.77 లక్షల నగదును అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ మురళీకృష్ణ తెలిపిన మేరకు.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా బుధవారం రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, పట్టణంలోని పలు లాడ్జీల్లో తనిఖీలు చేపట్టారు. నంద్యాల జిల్లా డోన్ మండలం ఆవులదొడ్డి గ్రామానికి చెందిన నరేంద్ర బస్టాండులో అనుమానాస్పదంగా తిరుగుతుండగా గుర్తించారు. అతని వద్ద ఉన్న బ్యాగును పరిశీలించగా, రూ.12.77 లక్షల నగదు కనిపించింది. దీంతో నగదు స్వాధీనం చేసుకుని నరేంద్రను అర్బన్ పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో తక్కువ ధరకు బంగారాన్ని కొనుగోలు చేయడానికి నరేంద్ర వెళుతున్నట్లు విచారణలో వెల్లడైంది. అయితే, నగదుకు సంబంధించి ఎలాంటి రసీదులు, ఆధారాలు చూపకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం నగదును ఇన్‌కంట్యాక్స్ అధికారులకు అప్పగించినట్లు అర్బన్ సీఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ముద్దాయికి రెండేళ్ల జైలు

అనంతపురం: హత్యాయత్నం కేసులో ఓ వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష పడింది. వివరాలు.. అనంతపురం నగరంలోని రహమత్‌నగర్‌కు చెందిన వ్యాను డ్రైవర్ ఉమా మహేష్‌కు, అదే ప్రాంతానికి చెందిన మహమ్మద్ ముషాదిక్‌కు మధ్య 2018 డిసెంబర్ 6న గొడవ జరిగింది. ఈ క్రమంలోనే ఉమా మహేష్‌పై మహమ్మద్ ముషాదిక్ కత్తితో దాడి చేశాడు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదైంది. అప్పటి ఎస్‌ఐ ఎం. బలరామరావు దర్యాప్తు పూర్తి చేసి స్థానిక పీఏఎస్‌జే కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. జడ్జి దీన అన్ని కోణాల్లో విచారణ జరిపారు. నేరం రుజువు కావడంతో బుధవారం ముద్దాయి మహమ్మద్ ముషాదిక్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధించారు. అలాగే, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా దర్యాప్తు అధికారి ఎస్‌ఐ ఎం. బలరామారావు, పీపీ వెంకట్రామి రెడ్డి, ఏఎస్‌ఐ కృష్ణ, కానిస్టేబుళ్లు కుమార్, రామకృష్ణను ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభినందించారు.

వైద్య సేవల్లో నవ చరిత్ర

- 11 నెలల్లో 3.21 లక్షల మందికి ఔట్‌పేషెంట్ సేవలు
- రాష్ట్రంలోనే టాప్‌-6లో జిల్లా
- ఒక్కో యూపీహెచ్‌సీలో రోజూ సగటున 39 మందికి సేవలు
- 2.44 లక్షల మందికి రక్త పరీక్షలు
- పేదలకు భారీగా తగ్గిన ఖర్చులు

గడిచిన 11 మాసాల్లో ఔట్‌పేషెంటు సేవలు ఇలా

నెల	లబ్ధిదారుల సంఖ్య
2023 ఏప్రిల్	25,599
2023 మే	27,320
2023 జూన్	27,997
2023 జూలై	27,899
2023 ఆగస్టు	26,732
2023 సెప్టెంబర్	26,732
2023 అక్టోబర్	32,797
2023 నవంబర్	33,530
2023 డిసెంబర్	29,169
2024 జనవరి	33,688
2024 ఫిబ్రవరి	30,276



అనంతపురం నగరంలోని ఆదిమూర్తి నగర్‌లో అత్యాధునికంగా నిర్మించిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను కొత్త పుంతలు తొక్కిస్తున్న సర్కారు..పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో అద్భుతంగా వైద్యసేవలు అందిస్తోంది. పట్టణాల్లో నివసిస్తున్న పేదలు ప్రతి చిన్న ఆరోగ్య సమస్యకూ పెద్దాస్పత్రులకు వెళ్లకుండా యూపీహెచ్‌సీలను ఏర్పాటు చేశారు. టీడీపీ హయాంలో వీటిని ప్రైవేటుకు అప్పగించి దారుణంగా దోచుకుంటే.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ దురవస్థను దూరం చేసింది. ఆస్పత్రులను అత్యాధునికంగా తీర్చిదిద్దింది. ఇద్దరు వైద్యులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆరోగ్య కేంద్రాల్లోనే 65 రకాల పరీక్షలు నిర్వహించే సౌలభ్యం కల్పించింది. ఆరోగ్య సేవలను విస్తృతం చేసింది.

11 నెలల్లో 3.21 లక్షల మందికి సేవలు

జిల్లాలో 25 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో కేంద్రంలో రోజుకు సగటున 39 మందికి చొప్పున గడిచిన 11 నెలల్లో 3.21 లక్షల మందికి ఓపీ సేవలు అందించారు. 2.44 లక్షల మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. దీంతో రాష్ట్రంలోనే టాప్‌-6లో జిల్లా నిలిచింది. యూపీహెచ్‌సీ ఔట్‌పేషెంటు సేవల్లో ఇదో చరిత్ర. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పేదలకు వైద్య ఖర్చులు గణనీయంగా తగ్గాయి. దేశంలోని మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలోనే అత్యధికంగా ఒక్కో వ్యక్తికి ఏడాదికి సగటున రూ.3,500 మేర వైద్య ఖర్చులు తగ్గినట్టు కుటుంబ సంక్షేమశాఖ వార్షిక నివేదిక పేర్కొంది.

వైద్యులు బాగా చూస్తున్నారు



“ మా ఇంటికి సమీపంలోనే పట్టణ ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారు. యాంటినేటల్ చెకప్ కోసం ఇక్కడికి తరచుగా వస్తున్నా. వైద్యురాలు, సిబ్బంది చాలా బాగా చూస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రి తరహాలోనే సేవలందిస్తున్నారు. మా ప్రాంతంలోనే ఆస్పత్రి ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– శృతి, గర్భిణీ, బుద్ధప్పనగర్, అనంతపురం

వ్యయ ప్రయాసలు తప్పాయి



రూ.కోటి పైగా నిధులతో కోర్టు రోడ్డులో పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మించారు. నేను, మా కుటుంబీకులు జ్వరం, ఇతరత్రా సమస్యలు వస్తే ఇక్కడికే వచ్చి చూపించుకుంటున్నాం. సమీపంలోనే ఆస్పత్రి ఉండడంతో వ్యయ ప్రయాసలు తప్పాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆటోలో కొద్ది దూరం వెళ్లాలన్నా రూ.100కు తక్కువ కాదు. అందులోనూ జనంలో ఉక్కిరిబిక్కిరి కావాలి. అలాంటి కష్టాలన్నింటినీ ప్రభుత్వం తప్పించింది.

– సంజీవరాయుడు, ప్రకాష్ రోడ్డు, అనంతపురం

ఇవే సేవలకు ప్రైవేటులో రూ. వేల ఖర్చు



వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం. ప్రస్తుతం 60 రకాల వైద్య పరీక్షలు, 174 రకాల మందులను ఉచితంగా అందిస్తున్నాం. ప్రైవేటుగా ఇటువంటి పరీక్షలు, మందులు తీసుకోవాలంటే రూ.వేలల్లో ఖర్చు అవుతుంది. గతంతో పోల్చితే ఓపీ సంఖ్య గణనీయంగా పెరిగింది. రోజూ 60 నుంచి 70 వరకు ఉంటోంది.

– డాక్టర్ సారిక, హమాలీకాలనీ,అనంతపురం

‘అమిలినేని’ మట్టి దందాపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం సెంట్రల్: కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు సాగించిన మట్టి దందాపై అధికారులు విచారణ చేపట్టారు. ‘సాక్షి’ దినపత్రికలో మంగళవారం ‘మట్టిని మింగిన అమిలినేని’, బుధవారం ‘అమిలినేని.. ఇదేం పని!’ శీర్షికలతో కథనాలు ప్రచురితమైన విషయం విదితమే. జీడిపల్లి–భైరవానితిప్ప ప్రాజెక్టు (బీటీపీ) కాలువ పనులను చేస్తున్న అమిలినేని సురేంద్రబాబుకు చెందిన ఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ (ఎస్‌ఆర్‌సీ) సంస్థ ఎర్రమట్టిని భారీఎత్తున అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్న విషయాన్ని ‘సాక్షి’ కథనాల్లో బహిర్గతం చేసింది. కళ్యాణదుర్గం పట్టణంలో అమిలినేని నిర్మిస్తున్న సొంత భవంతికి సైతం ఈ ఎర్రమట్టిని వాడుకున్న విషయాన్ని సాక్ష్యాధారాలతో సహా వెలుగులోకి తెచ్చింది. దీనిపై జలవనరుల శాఖ అధికారులు స్పందించారు. ఆ శాఖ చీఫ్ ఇంజినీరింగ్ (సీఈ) శ్రీనివాసరెడ్డి, హంద్రీ–నీవా ఎస్‌ఈ దేశేనాయక్ బుధవారం సంబంధిత ఈఈ రాజాస్వరూప్‌తో కలసి బీటీపీ కాలువ పనులను పరిశీలించారు. బెళుగుప్ప మండల పరిధిలో పనులు జరిగిన చోట తనిఖీ చేశారు. ఎన్ని కిలోమీటర్ల మేర కాలువ తవ్వారు.. ఎంత మట్టి పక్కకు తరలిపోయిందనే విషయంపై ఆరా తీశారు. అనుమతులు తీసుకోకుండానే మట్టి తరలించారని, విషయం బయటకు పొక్కడంతో నామమాత్రంగా కొంత రుసుమును ప్రభుత్వానికి చెల్లించినట్లు అధికారులు గుర్తించారు.

నోటీసుల జారీకి ఆదేశం

ప్రస్తుతం తవ్విన కాలువ ద్వారా ఎంత మట్టి వచ్చి ఉంటుంది.. ప్రస్తుతం అక్కడ ఎంత ఉంది, ఎంత మట్టి తరలిపోయిందనే విషయంపై లెక్కలు తేల్చాలని హంద్రీ–నీవా సిబ్బందిని సీఈ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. అక్రమంగా తరలిపోయిన మట్టికి సంబంధించి వివరణ కోరుతూ కాంట్రాక్టు సంస్థకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. ఇదిలావుండగా..అమిలినేని సంస్థ భారీఎత్తున మట్టి అక్రమంగా తరలించినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. అందుకు తగ్గట్టుగానే జరిమానా విధించాలని నిర్ణయించారు. జరిమానా చెల్లించని పక్షంలో ఇప్పటివరకు చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు నిలుపుదల చేయాల్సి ఉంటుందని సూచనప్రాయంగా తెలియజేసినట్లు సమాచారం. అలాగే పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైనాన్ని కూడా ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణిస్తున్నారు. బాధ్యులపై చర్యలకు సమాయత్తమవుతున్నారు.

సులువుగా సమాచారం

- ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఏర్పాట్లు
- పలు యాప్‌లు, టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులోకి
- నిబంధనల ఉల్లంఘనపై ఫిర్యాదులూ చేయొచ్చు



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమాండ్ కంట్రోల్ రూమ్

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడమే లక్ష్యంగా ఎన్నికల కమిషన్ ప్రత్యేక విధానాలు అమలు చేస్తోంది. సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఓటు హక్కుపై సందేహాల నివృత్తి, సమాచారం కోసం 1950 టోల్ ఫ్రీ నంబర్‌తో పాటు ‘సమాధాన్’ యాప్ తీసుకొచ్చింది. అలాగే, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్ దాఖలుకు, వాహనాల అనుమతికి సంబంధించి ‘సువిధ’యాప్, ఫిర్యాదుల స్వీకరణకు సీ–విజిల్ యాప్‌ను ప్రవేశపెట్టింది.

సమస్త వివరాలు తెలుసుకోవచ్చు..

ఓటరు జాబితా సవరణలో దేనికి ఏ ఫారం వాడాలి, ఓటు ఉందా లేదా అని తెలుసుకునేందుకు, ఇతరత్రా సందేహాల నివృత్తి కోసం ప్రత్యేకంగా 1950 (టోల్ ఫ్రీ) ఎన్నికల కాల్ సెంటర్‌ని ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసింది. ప్రజలు ఈ నంబర్‌కు ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. ఓటరు ఐడీ (ఎపిక్) నంబర్ చెబితే ఓటు ఉందా లేదా, ఉంటే ఏ పోలింగ్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది చెబుతారు.అలాగే, ఓటు నమోదుకు దరఖాస్తు చేసిన వారు అది ఏస్థాయిలో ఉందనే విషయం తెలుసుకోవచ్చు. రెఫరెన్స్ ఐడీ నంబర్ చెబితే చాలు.

‘సమాధాన్’ యాప్..

1950 కాల్ సెంటర్ తరహాలోనే ‘సమాధాన్’ యాప్‌ని ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టింది. అయితే మనకు కావాల్సిన సమాచారం కోసం మెసేజ్ రూపంలో ఫిర్యాదు పంపాల్సి ఉంటుంది. సమాధానం కూడా మెసేజ్ రూపంలో వస్తుంది. ఓటు ఉందా? లేదా? పోలింగ్ స్టేషన్ పరిధి ఏది? తదితర వివరాలను తెలుసుకోవచ్చు.

అభ్యర్థుల కోసమూ..

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కోసం ‘సువిధ’ యాప్ తీసుకొచ్చారు. అభ్యర్థులు తమ నామినేషన్‌ను ‘సువిధ’ ద్వారానే దాఖలు చేయాలి. అలాగే, ప్రచారం కోసం ఉపయోగించుకునే వాహనాలకు అనుమతి కూడా ‘సువిధ’ ద్వారానే పొందాల్సి ఉంటుంది. మాన్యువల్ విధానంలో దరఖాస్తులు ఇచ్చినప్పుడు తాము ముందంటే తాము ముందంటూ అధికారులతో అభ్యర్థులు వాదనకు దిగిన సందర్భాలు గతంలో ఉన్నాయి. అయితే ‘సువిధ’ యాప్ ద్వారా దరఖాస్తు చేసినప్పుడు సమయం నమోదవుతుంది. ఆ ప్రకారం ఏది ముందు వస్తే దాని ప్రకారం అనుమతి ఇస్తారు.

బ్రహ్మాస్త్రం.. సీ–విజిల్

ఎన్నికల్లో జరిగే అవకతవకలపై నేరుగా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు ‘సీ–విజిల్’ యాప్ ప్రవేశపెట్టారు. ఈ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఎక్కడైనా ఎన్నికల కమిషన్ నియమావళి ఉల్లంఘన జరుగుతున్నా, డబ్బు, మద్యం పంపిణీ చేస్తున్నా, ఎవరైనా ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నా ఆయా విషయాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి లేదా వివరాలను మెసేజ్ రూపంలో ఈ యాప్ ద్వారా నేరుగా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఈ క్రమంలోనే మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అధికారులు, స్టాటిస్టిక్ సర్వైలెన్స్ బృందాలు రంగంలోకి దిగి తగిన చర్యలు తీసుకుంటాయి. ఈ ప్రక్రియను 100 నిమిషాల్లోనే పూర్తి చేయాల్సి ఉండడం ఇందులో ప్రత్యేకత.

సద్వినియోగం చేసుకోవాలి



ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. మేనేజ్‌మెంట్ కమిటీలన్నింటినీ ఒకే చోట ఉండి పర్యవేక్షిస్తాయి. కమిటీల కోసం కార్యాలయంలో సెంట్రలైజ్డ్ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. సమాచారం కోసం 1950 (టోల్‌ఫ్రీ) కాల్‌సెంటర్ అందుబాటులోకి తీసుకొచ్చాం. సీ–విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులు 100 నిమిషాల్లో పరిష్కరిస్తాం. సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం.గౌతమి, జిల్లా ఎన్నికల అధికారి

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి

అనంతపురం అర్బన్: స్వేచ్ఛాయుత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు అత్యంత పకడ్బందీగా చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి రాజకీయ పార్టీ ప్రతినిధులకు చెప్పారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి (కోడ్ ఆఫ్ కాండక్ట్) కఠినంగా అమలు చేస్తున్నామన్నారు.ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డితో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఈనెల 16న షెడ్యూల్‌ను విడుదల చేసిన వెంటనే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. ఎన్నికల ప్రక్రియ జూన్ 6 నాటికి ముగుస్తుందన్నారు. జిల్లాలో ఈనెల 19 నాటికి 19,98,841 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. జిల్లావ్యాప్తంగా 2,213 పోలింగ్ కేంద్రాలు, 23 సహాయక పోలింగ్ కేంద్రాలు మొత్తం 2,236 ఉన్నాయన్నారు. వీటిలో 1,032 కేంద్రాలను క్లిష్టమైనవిగా గుర్తించామన్నారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఏప్రిల్ 12న ఈవీఎం మొదటి రాండమైజేషన్, మే 1న రెండో రాండమైజేషన్ నిర్వహిస్తామన్నారు. పోలింగ్ సిబ్బందికి ఏప్రిల్ 4 నుంచి 10 లోగా శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేస్తామన్నారు. రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో వలంటీర్లు పాల్గొనకూడదన్నారు. ఎక్కడైనా పాల్గొంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎనికల నేపథ్యంలో అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో 32 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, వెబ్ కాస్టింగ్ చేపట్టామన్నారు.

దరఖాస్తు చేసుకోవచ్చు

ఎన్నికల షెడ్యూల్ ప్రకారం గెజిట్ నోటిఫికేషన్ ఏప్రిల్ 18న జారీ అవుతుందని కలెక్టర్ తెలిపారు. ఆ రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందన్నారు. నామినేషన్ల స్వీకరణ తేదీకి 10 రోజులు ముందు వరకు కొత్తగా ఓటరు నమోదుకు (ఫారం–6) దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఓటు తొలగింపునకు అందే దరఖాస్తులపై విచారణ చేసి నివేదికను సీఈఓ కార్యాలయానికి పంపిస్తామన్నారు. అక్కడి నుంచి అనుమతి వచ్చిన తరువాతనే ఓటు తొలగింపు చేపడతామన్నారు. ఓటు హక్కు వినియోగంపై నియోజకవర్గాల వారీగా స్వీప్ కార్యక్రమాలు చేపడతామన్నారు. ఫిర్యాదుల స్వీకరణకు కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. 1950 కాల్ సెంటర్ (టోల్‌ఫ్రీ), 08554–231722, 08554–231922, 08554–232922 నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు. సమావేశంలో పార్టీల ప్రతినిధులు శ్రీనివాసులు, పవన్ కుమార్, ఈశ్వర్‌ప్రసాద్, ఇమామ్, బాలరంగయ్య, రమేశ్‌నాయుడు, అంజయ్య పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించాలి

అనంతపురం అర్బన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. శింగనమల నియోజకవర్గానికి సంబంధించి నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో, అనంతపురం నియోజకవర్గానికి సంబంధించి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, ఈవీఎంల కమిషనింగ్, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాట్లు వేగవంతంగా పూర్తి చేయాలని చెప్పారు. భద్రతా పరంగా ఇబ్బంది తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ సిబ్బందికి సామగ్రిని అందించడంలో లోటుపాట్లు రాకుండా చూసుకోవాలన్నారు. అప్పగించిన బాధ్యతలను అధికారులు, సిబ్బంది సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో అనంతపురం ఆర్‌ఓ జి.వెంకటేష్, శింగనమల ఆర్‌ఓ వెన్నెల శ్రీను, తహసీల్దారు శివరామిరెడ్డి, డీవీఈఓ వెంకటరమణనాయక్, జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సిద్ధేశ్వరరెడ్డి, ఈఆర్‌ఓలు ఉన్నారు.

ఉపాధి పనుల వద్ద టెంట్ల ఏర్పాటు

అనంతపురం టౌన్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులకు వచ్చే కూలీలకు ఎండ వేడిమి నుంచి రక్షణ కల్పించేందుకు విధిగా టెంట్లు ఏర్పాటు చేయాలని డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఏపీడీలు, ఏపీఓలతో ఆయన టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ప్రతి మండలంలో రోజూ 5 వేల మంది కూలీలకు పనులు కల్పించేలా లక్ష్యం నిర్దేశించుకొని ముందుకెళ్లాలన్నారు. పనులు జరిగే చోట తాగునీటితోపాటు మందుల కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు.

● కల్యాణం.. కమనీయం



కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా సాగింది. వసంత వల్లభుడిగా భక్తులు పిలుచుకునే ఖాద్రీశుడి కల్యాణం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదిక భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. శ్రీవారి కల్యాణం సందర్భంగా ఆలయాన్ని, ప్రాంగణాన్ని వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో విశేషంగా అలంకరించారు. నారసింహుడి కల్యాణం కనులారా వీక్షించేందుకు భారీగా భక్తులు తరలిరాగా, ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శ్రీవారి కల్యాణోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున కలెక్టర్ అరుణ్‌బాబు శ్రీవారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకొచ్చారు. అంతకు మునుపు కలెక్టర్ ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. హిందూపురం పార్లమెంట్ సభ్యులు గోరంట్ల మాధవ్ దంపతులు, స్థానిక ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి దంపతులు శ్రీవారికి పట్టు వస్త్రాలు అందజేశారు.

కల్యాణోత్సవం తిలకిస్తున్న భక్త జనం (ఇన్‌సెట్) శ్రీవారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

లక్ష్యం సాధించాం

- మార్కెట్‌యార్డు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యవసాయ మార్కెట్ యార్డుకు నిర్దేశించిన 2023–24 వార్షిక లక్ష్యాన్ని అధిగమించినట్లు యార్డు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ... ఈ ఏడాది రూ.4.12 కోట్ల సాధనే లక్ష్యంగా నిర్దేశించుకోగా... బుధవారం నాటికి నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకున్నట్లు తెలిపారు. గడువుకు మరో పది రోజుల సమయం ఉన్నందున వివిధ రకాల పన్ను వసూళ్లు మరింత పెరుగుతాయన్నారు. రైతులు, వ్యాపారులు, పాలక వర్గం, అధికారులు, సిబ్బంది సహకారంతో గడువులోపు వంద శాతం లక్ష్యాన్ని సాధించినట్లు పేర్కొన్నారు.

నగదు పట్టివేత

కుందుర్పి: మండలంలోని మలయనూరు చెక్ పోస్టు వద్ద బుధవారం ఉదయం కారులో తరలిస్తున్న రూ. 1.90లక్షల నగదును వీఆర్వో అజిత్, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటకలోని దావణగెర నుంచి వైఎస్‌హెచ్ కోటకు నగదు తీసుకెళుతున్నట్లుగా పట్టుబడిన యువకుడు తెలిపాడు. అయితే నగదు తరలింపునకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో డబ్బుతో పాటు వాహనాన్నీ సీజ్ చేసి, యువకుడిపై కేసు నమోదు చేశారు.

జెడ్పీలో సీట్ల మార్పిడి

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ కార్యాలయంలో పలువురు ఉద్యోగులకు సీట్లు మార్చారు. ఈ మేరకు సీఈఓ వైఖోమ్ నిదియాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సజావుగా సాగేలా కీలక సీట్ల విషయంలో మార్పు, చేర్పులు చేసినట్లు తెలుస్తోంది. డిప్యుటేషన్‌పై వచ్చిన ఏఓ హరినాథ్‌కు ఎ సెక్షన్ వ్యవహారాలు అప్పగించారు. సీనియర్ అసిస్టెంట్ కేశవకు ఏ1, ఏ4 కారుణ్య నియామకాల సీటు కేటాయించారు. మరో సీనియర్ అసిస్టెంట్–శ్రీనివాసులు... ఏ2, ఎలక్ట్రిసిటీ, టెలిఫోన్ బిల్లులు, శానిటరీ ఐటమ్స్, బిల్లులు చూస్తారు. ఏఓ–ఉషారాణికి 'కె' సెక్షన్ బాధ్యతలు అప్పగించారు. ఏఓ ధనుంజయనాథ్‌కు 'ఐ' సెక్షన్, ఏఓ హనుమంతరెడ్డికి 'హెచ్' సెక్షన్, ఇంకో ఏఓ నాగేంద్రకుమార్‌కు 'ఎల్' సెక్షన్ బాధ్యతలు అప్పగించారు. సీఈఓ సీసీగా పని చేసిన ఇమ్రాన్‌కు జీ2, రాఘవేంద్రుడుకు ఐ–4, 5 విభాగాలు అప్పగించారు.

కళ్యాణదుర్గం పరిశీలకుడిగా మల్లు ప్రసాదరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకులుగా మల్లు ప్రసాదరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

భద్రతకు భరోసా

- ప్రశాంత ఎన్నికలకు పటిష్ట చర్యలు
- గ్రామసభల నిర్వహణతో ప్రజలకు భరోసా కల్పిస్తున్న పోలీసులు
- రౌడీ షీటర్లు, కిరాయి హంతకుల ఇళ్లల్లో ఆకస్మిక సోదాలు
- ఇప్పటికే 54 సమస్యాత్మక గ్రామాలు గుర్తింపు



ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మన్నీల, ఇటుకలపల్లి, ఆకుతోటపల్లి, కందుకూరు గ్రామాల్లో బుధవారం ఉదయం పోలీసు కవాతు కొనసాగింది. కేంద్ర సాయుధ బలగాలతో పాటు సర్కిల్ పరిధిలోని పోలీసులు పాల్గొన్నారు. నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ ప్రజలను చైతన్య పరిచేలా అనంతపురం రూరల్ డీఎస్పీ టీవీ శివారెడ్డి, అసిస్టెంట్ కమాండర్ ధర్మేందర్‌సింగ్, సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ కొనసాగింది. ప్రశాంత ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో కవాతు చేపట్టారు.



పల్లె నిద్ర కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులు

అనంతపురం: ప్రజలతో మమేకం కావడం.. సమస్యలను ఆదిలోనే గుర్తించి వాటికి సంతృప్తికరమైన పరిష్కారం చూపడం, ప్రజల్లో పోలీసులంటే ఉన్న భయాన్ని తొలగించడం.. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చేయడం... ఇదీ డీఐజీ ఆర్.ఎస్.అమ్మిరెడ్డి, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ నేతృత్వంలో జిల్లా పోలీసులు చేపట్టిన వినూత్న కార్యక్రమం. ఇందులో భాగంగానే పల్లె నిద్ర పేరుతో సమస్యాత్మక గ్రామాల్లో రాత్రిళ్లు బస చేస్తున్నారు. గ్రామంలో సమస్యలు గుర్తించి వాటికి తక్షణ పరిష్కారం చూపుతున్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను పెంచేలా...

పల్లె నిద్రలో భాగంగా పోలీసుల ఆయా స్టేషన్ల పరిధిలో ముందుగా సమస్యాత్మక గ్రామాలను ఎంపిక చేస్తున్నారు. అనంతరం గ్రామస్తులకు సమాచారం అందించి, సాయంత్రం 7 గంటలకు గ్రామ సచివాలయం, లేదా ప్రభుత్వ భవనాల వద్ద సమావేశాలు ఏర్పాటు చేస్తారు. ఆ గ్రామంలో సమస్యలు, అసాంఘిక కార్యకలాపాలపై ఆరా తీస్తున్నారు. అనంతరం వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఎలాంటి తీవ్ర నేరాలు చోటు చేసుకోకుండా అడ్డుకట్ట వేస్తున్నారు. ఈ క్రమంలో డీఐజీ అమ్మిరెడ్డి ఆదేశాలతో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో పోలీసు వ్యవస్థపై మరింత నమ్మకం పెంచేలా సిబ్బంది వ్యవహరిస్తున్నారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో ఇప్పటికే 54 సమస్యాత్మక గ్రామాలు గుర్తించారు. ఇందులోనూ ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజల్లో ఆత్మస్థైర్యం పెంచేందుకు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్నారు. కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు, పికెటింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి గొడవలు, నేరాల జోలికి వెళ్లకుండా నిఘా పటిష్టం చేశారు. సమస్యలు సృష్టించే ట్రబుల్ మాంగర్స్, నేర చరిత్ర కలిగిన పూర్వ రౌడీషీటర్ల ప్రస్తుత జీవన విధానం, స్థితిగతులపై ఆరా తీస్తున్నారు. జిల్లా స్పెషల్ బ్రాంచి, లా అండ్ ఆర్డర్, సెబ్, ఏఆర్, సైబర్, ఐటీ కోర్, తదితర విభాగాల అధికారులతో ఎప్పటికప్పుడు డీఐజీ, ఎస్పీ సమావేశమై విధులు పక్కాగా నిర్వర్తించేలా సమన్వయం చేస్తున్నారు.

అక్రమ రవాణాపై నిరంతర నిఘా

ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అక్రమ రవాణాపై నిఘా, విస్తృత తనిఖీలు విస్తృతం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి లిక్కర్, డబ్బు, మాదక ద్రవ్యాలు, మారణాయుధాలు, గిఫ్ట్ ఐటమ్స్ జిల్లాలోకి రాకుండా సరిహద్దుల్లో 20 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అలాగే అత్యంత సమస్యాత్మకమైన నియోజకవర్గాల పరిధిలో మూడు అంతరజిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటయ్యాయి. ప్రతి చెక్‌పోస్టులోనూ నలుగురు సిబ్బంది 24 గంటలూ విధుల్లో ఉంటున్నారు. ప్రత్యేకంగా కర్ణాటక ప్రాంతం నుంచి జిల్లాలోకి ప్రవేశిస్తున్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే అనుమతిస్తున్నారు. వీటితో పాటు 4 డైనమిక్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పోలీసులు, సెబ్ సిబ్బందితో అక్రమ రవాణాను అడ్డుకట్ట వేశారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు తావివ్వకుండా ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) 45 బృందాలను ఏర్పాటు చేశారు. అలాగే 24 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ (ఎస్ఎస్‌టీ), 24 ఫ్లయింగ్ స్క్వాడ్స్ (ఎఫ్ఎస్‌టీ)ను రంగంలోకి దింపారు.

ఆదిలోనే గుర్తించేలా...



చిన్నపాటి గొడవలు సైతం తలెత్తకుండా జిల్లాలో 45 ఎంసీసీ టీమ్స్‌ను ఏర్పాటు చేశాం. వివాదాలను ఆదిలోనే గుర్తించి పరిష్కరిస్తే తీవ్ర నేరాలు జరిగే ఆస్కారం ఉండదు. ఆ ఉద్దేశ్యంతోనే పటిష్ట చర్యలు తీసుకున్నాం. విజిబుల్ పోలీసింగ్ విధానం పటిష్టం చేశాం. భవిష్యత్తులో మరింతగా ప్రజల్లోకి ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను తీసుకెళ్తున్నాం.

– ఆర్.ఎస్.అమ్మిరెడ్డి, డీఐజీ

ప్రలోభాలకు ఆస్కారం లేకుండా...



జిల్లాలో పారదర్శక ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా పనిచేస్తున్నాం. అక్రమాలకు తావు లేకుండా రంగంలోకి ప్రత్యేక బృందాలను దింపాం. స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవడమే మా లక్ష్యం. ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పకుండా పాటించడంతో పాటు ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలి.

– కేకేఎన్ అన్బురాజన్, ఎస్పీ

ఆటో బోల్తా... ఐదుగురికి గాయాలు



క్షతగాత్రులను పరామర్శిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం రూరల్: స్థానిక రాయల్ కళాశాల వద్ద ఆటో బోల్తాపడిన ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన మేరకు... టి.వీరాపురం గ్రామానికి చెందిన ఐదుగురు బుధవారం ఉదయం అదే గ్రామానికి చెందిన మంగరి రాజు ఆటోలో రాయదుర్గం నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. రాయల్ కాలేజ్ వద్దకు చేరుకోగానే ఆటో ఎడమవైపు బ్రేక్ లైనర్లు ఒక్కసారిగా జామ్ అయ్యాయి. అప్పటికే వేగంగా వెళుతున్న ఆటో ఉన్నఫళంగా ఎడమవైపు తిరిగి బోల్తాపడింది. ఘటనలో వీరాపురం గ్రామానికి చెందిన మెచ్చిరి భీమన్నకు కుడి భుజం ఎముక విరిగింది. తలకు, నడుముకు గాయాలయ్యాయి. శివమ్మ, రాజు, లింగప్ప, ఆశిష్ కుమార్‌కు మూగదెబ్బలు తగిలాయి. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు మెచ్చిరి భీమన్నను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి రెఫర్ చేశారు. విషయం తెలుసుకున్న రాయదుర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. ఖర్చుల నిమిత్తం భీమన్నకు రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. తీవ్రంగా గాయపడిన హరిజన శివమ్మకు వీరాపురం గ్రామ వైఎస్సార్‌సీపీ యువ నేత మహేష్ రూ.2వేలు ఆర్థిక సాయం చేశారు.

కర్ణాటక మద్యం పట్టివేత

అనంతపురం: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు అనంతపురం నాల్గో పట్టణ సీఐ ప్రతాపరెడ్డి తెలిపారు. బుధవారం అనంతపురంలోని వికలాంగుల కొట్టాలలో ఎస్ఐ నాగమధు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టినప్పుడు కర్ణాటక మద్యం విక్రయిస్తూ రమేష్ పట్టుబడ్డాడన్నారు. నిందితుడి నుంచి 864 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఇప్పటికే నిందితుడిపై కుందుర్పి, అనంతపురం సెబ్ పోలీసుస్టేషన్ పరిధిలో మూడు కేసులు ఉన్నాయని పేర్కొన్నారు.

కంబదూరు: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని బుధవారం ఉదయం ఓబుగానిపల్లి చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనిపల్లికి చెందిన చాకలి శివ ద్విచక్ర వాహనంపై 384 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని పట్టుబడ్డాడన్నారు.

కూతురి కోసం తల్లి ఆరాటం

- బాలికను అపహరించిన యువకుడు
- పోలీసు స్టేషన్ ఎదుట తల్లి ఆందోళన

కళ్యాణదుర్గం: ఓ తల్లి తన కుమార్తె కోసం మిట్ట మధ్యాహ్నం మండుటెండలో గంటల తరబడి బైఠాయించింది. 15 రోజుల క్రితం కనిపించకుండా వెళ్లిన తన కుమార్తె ఆచూకీ పసిగట్టడంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేసింది. వివరాలు... కళ్యాణదుర్గంలోని డీఎస్పీ పాత కార్యాలయ సమీపంలో నివాసముంటున్న ఓ 17 ఏళ్ల బాలికను అదే ప్రాంతంలో నివాసముంటున్న యువకుడు రాజు అపహరించుకెళ్లాడు. దీనిపై 15 రోజుల క్రితమే బాలిక తల్లి త్రివేణిదేవి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి రోజూ పోలీసు స్టేషన్ చుట్టూ తిరిగినా కుమార్తెను గురించిన ఏ వివరాలు తెలియరాలేదు. బుధవారం ఉదయం మరోసారి పట్టణ పోలీసులను కలసి కుమార్తె ఆచూకీ కోసం ఆరా తీసింది. ఎలాంటి స్పందన లేకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆమె స్టేషన్ ఎదుట బైఠాయించి తన కుమార్తె ఆచూకీ తెలపాలంటూ పోలీసులను వేడుకుంది. తన కుమార్తెను మాయమాటలతో లోబర్చుకుని అపహరించుకెళ్లిన రాజు, అతని కుటుంబసభ్యులు చిత్రహింసలకు గురి చేస్తూ వీడియోలు సైతం పంపిస్తున్నారని కన్నీరుమున్నీరుగా రోదించింది. తన ఫిర్యాదును నిర్వీర్యం చేసేలా పోలీసులను సైతం రాజు తరఫున కుటుంబసభ్యులు, బంధువులు ప్రభావితం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కుమార్తెను తన వద్దకు చేర్చకపోతే ఆత్మహత్య తప్ప మరో మార్గం లేదంటూ విలపించింది.



పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించిన త్రివేణిదేవి

ఓటరు నమోదుకు మరో అవకాశం

రాయదుర్గంటౌన్: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. నామినేషన్ల చివరి రోజు అంటే ఏప్రిల్ 25వ తేదీ వరకూ అవకాశం ఉంటుందని ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజున రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి ముఖేష్ కుమార్‌మీనా వెల్లడించారు. అయితే ఓట్ల తొలగింపు, మార్పులు, చేర్పులకు అవకాశం ఉండబోదు. కేవలం కొత్తగా ఓటరు నమోదు (ఫారం6)కు మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ నేపథ్యంలో 18 ఏళ్లు నిండిన వారే కాక ఇప్పటి వరకూ ఓటు హక్కు లేని వారు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరికి సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థులకు ఓటు వేసి వినియోగించుకునే అవకాశం కల్పిస్తారు. ఐదేళ్ల పాటు ప్రజలను పాలించే వారిని ఎన్నుకోవడంలో ఓటు హక్కు కీలకం కానుంది. అర్హులు నిర్లక్ష్యం చేయకుండా ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఆన్‌లైన్ లేదా, తహశీల్దార్ కార్యాలయంలోని ఎన్నికల విభాగంలో దరఖాస్తు చేసుకోవచ్చు.

నిధి పోర్టల్ ద్వారానే ఏపీ జీఎల్ఐ కార్యకలాపాలు

అనంతపురం సిటీ: అన్ని శాఖల ఉద్యోగులకు సంబంధించిన ఏపీజీఎల్ఐ (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా) వ్యవహారాలన్నీ ఇకపై నిధి పోర్టల్ ద్వారానే ఆన్‌లైన్‌లో కొనసాగుతాయని ఆ శాఖ అనంతపురం డిప్యూటీ డైరెక్టర్ భాస్కర్ తెలిపారు. ఇప్పటికే ఉద్యోగుల పాలసీ, స్వీకరించిన ప్రీమియం, పొందిన రుణాల వివరాలను నిధి పోర్టల్‌కు బదిలీ చేసినట్లు వివరించారు. ఏపీజీఎల్ఐ పాలసీ తీసుకున్న ఉద్యోగులు, రుణాలు పొందిన వారు పోర్టల్‌లోని డేటాను పరిశీలించి ధ్రువీకరించుకోవాలన్నారు. పాలసీవారీగా డేటా ముద్రించిన కాపీలు ఆయా శాఖల డీడీఓల ద్వారా పొందవచ్చునన్నారు. పాలసీ డేటాలో అభ్యంతరాలు ఉంటే ఏప్రిల్ 30లోపు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గడువులోపు ఎలాంటి అభ్యంతరాలు తెలపకపోతే నిధి పోర్టల్‌లో ఉంచిన డేటాను కచ్చితమైనదిగా పరిగణిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాల్లో పని చేస్తున్న ఏపీజీఎల్ఐ చందాదారులు నిబంధనల మేరకు పాలసీ ఖాతాలను సరి చూసుకోవాలని కోరారు.

స్టాండింగ్ కమిటీ నియామకం

అనంతపురం అర్బన్: ఎన్నికల నిర్వహణలో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లాస్థాయి స్టాండింగ్ కమిటీని నియమించారు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలును పర్యవేక్షించేలా కమిటీని నియమించినట్లు పేర్కొన్నారు.

కమిటీ సభ్యులు వీరే...

జి.ఉమాపతి (వైఎస్సార్ సీపీ), సి.పవన్‌కుమార్ (టీడీపీ), ఎంపీ ఈశ్వరప్రసాద్ (బీజేపీ), షేక్ ఇమామ్ వలి (కాంగ్రెస్‌పార్టీ) ఎం.అంజయ్య (బీఎస్పీ), బాలరంగయ్య (సీపీఎం), షేక్ మసూద్ వలి (ఏఏపీ).

చోరీ చేస్తూ పట్టుబడిన యువకుడు

రాయదుర్గంటౌన్: స్థానిక ఓబుళాచారి రోడ్డులో ఉన్న బన్నీమహంకాళి ఆలయంలో హుండీ కానుకలు చోరీ చేస్తూ ఓ యువకుడు పట్టుబడ్డాడు. బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. అటుగా వెళ్లిన ఓ వ్యక్తి ఆలయం పైకప్పు రేకులు తొలగించి ఉండడం గమనించి సమాచారం ఇవ్వడంతో స్థానికులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అప్పటికే ఆలయంలోని హుండీని బద్దలుగొట్టేందుకు ప్రయత్నిస్తున్న యువకుడిని గుర్తించి పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతపరం పోలీసులకు అప్పగించారు. ఘటనపై నిందితుడిని పోలీసులు విచారిస్తున్నారు.

కలుషిత గడ్డి తిని జీవాలు మృతి

గుమ్మఘట్ట: కలుషిత గడ్డి తిన్న 29 జీవాలు మృత్యువాత పడ్డాయి. స్థానికులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం భూపసముద్రం గ్రామానికి చెందిన గొల్ల తమ్మన్న, గొల్ల రామకృష్ణ, శివలింగ, కొత్తపల్లి రామకృష్ణ... గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం తమ జీవాలను మేపునకు తోలుకుని అటవీ ప్రాంతానికి బయలుదేరారు. మార్గమధ్యంలో అదే గ్రామానికి చెందిన రైతు కృష్ణమూర్తి తోటలోకి ప్రవేశించిన జీవాలు బీడు భూమిలోని గడ్డిని తిన్నాయి. ఆ తర్వాత ఒక్కొక్కటిగా అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి నవీన్‌కుమార్ అక్కడకు చేరుకుని చికిత్స మొదలు పెట్టారు. ఈ లోపు ఓ ఆవుతో పాటు 15 గొర్రెలు, 13 మేకలు మృతి చెందాయి. తోటలో కలుపు నివారణకు సంబంధించి మందు పిచికారీ చేసినట్లుగా తెలిసింది. మరో 20 గొర్రెలు, మేకలు మృత్యువుతో పోరాడుతున్నాయి. ఘటనతో రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత కాపరులు వాపోయారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి వెంటనే స్పందించారు. ఫోన్ ద్వారా బాధితులను పరామర్శించి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

13 మందిపై కేసు నమోదు

రాయదుర్గం రూరల్: మండలంలోని కొంతానపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకున్న ఇరు వర్గాల ఘర్షణలో 13 మందిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. బోయ రమేష్, చంద్ర... పెద్ద ఆంజనేయులు, చిన్న ఆంజనేయులు రెండు వర్గాలుగా విడిపోయి పొలం విషయంలో దాడులు చేసుకున్నారు. ఘటనకు సంబంధించి ఇరు వర్గాల్లో పలువురు గాయపడ్డారు. పరస్పర ఫిర్యాదుల మేరకు 13 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ అనిల్

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ చామల అనిల్ వెంకటప్రసాదరెడ్డి (తాడిపత్రి) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో కేంద్ర కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

వైభవంగా లంకాదహనం

ఉరవకొండ: గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం లంకాదహనం అంగరంగ వైభవంగా సాగింది. గవిమఠం పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి, ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, మఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ ప్రారంభించారు. అంతకు ముందు అశ్వ వాహనంపై ఉత్సవ మూర్తులను ఊరేగించారు.



అశ్వ వాహనంపై విహరిస్తున్న చంద్రమౌళీశ్వరస్వామి

మంచి ఆహార అలవాట్లు అలవర్చుకోవాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: విద్యార్థి దశ నుంచే మంచి ఆహార అలవాట్లను అలవర్చుకోవాలని, దంత సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపించడంలో తల్లిదండ్రులు కీలకపాత్ర పోషించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి అన్నారు. ప్రపంచ నోటి ఆరోగ్య శుభ్రత మాసోత్సవాలను పురస్కరించుకుని ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ... వ్యక్తిగత పరిశుభ్రతను నిర్లక్ష్యం చేయడం ద్వారా దంత, చిగుళ్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. నిర్లక్ష్యం చేస్తే టాన్సిల్స్, ఊపిరితిత్తులు, గుండె సంబంధిత సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి, జిల్లా మలేరియా అధికారి ఓబులు, స్టాటిస్టికల్ ఆఫీసర్ రఫీ, డెమో సిబ్బంది త్యాగరాజు, గంగాధర్, డీఈఐసీ మేనేజర్ రజిత, తదితరులు పాల్గొన్నారు.

డీఈఐసీలో నోటి ఆరోగ్య దినోత్సవం


ప్రపంచ నోటి ఆరోగ్య శుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డీఈఐసీలో తల్లిదండ్రులు, పిల్లలకు నోరు, దంతాలు, చిగుళ్లు, నాలుకకు వచ్చే వ్యాధులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు తదితరులు మాట్లాడుతూ... దంత సంరక్షణ తీసుకోకపోవడం వల్ల ఒనగూరే దుష్పరిణామాలను వివరించారు. గ్రహంమొర్రి సమస్యలతో బాధపడే చిన్నారులు మరింత జాగ్రత్త తీసుకోవాలన్నారు. గత నాలుగేళ్లలో 182 మంది గ్రహణమొర్రి బాధిత పిల్లలకు శస్త్రచికిత్సలు చేసి, స్పీచ్ థెరపి ఇప్పించినట్లు పేర్కొన్నారు. అనంతరం హైదరాబాద్ ఏవీఆర్ ఆస్పత్రి నిర్వాహకుల సౌజన్యంతో పిల్లలకు టెడ్డీబేర్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణ స్వామి, డీఈఐసీ మేనేజర్ రజిత, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న డాక్టర్ భ్రమరాంబదేవి

నేత్రదానం

కూడేరు: మరణానంతరం మరో ఇద్దరికి కంటి చూపును ప్రసాదించారు వైఎస్సార్‌సీపీ యువ నేత వడ్డే పవన్‌కుమార్ (26). వివరాలు... కూడేరు మండలం జల్లిపల్లికి చెందిన పవన్‌కుమార్...మంగళవారం ఉదయం ఉరవకొండలో జరుగుతున్న గవిమఠం బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు ద్విచక్ర వాహనంపై వెళుతూ ఉదిరిపికొండ వద్ద కారు ఢీకొన్న మృతి చెందిన విషయం తెలిసిందే. పోస్టుమార్టం నిమిత్తం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి పవన్‌కుమార్ మృతదేహాన్ని పోలీసులు తరలించారు. దీంతో పవన్‌కుమార్ తండ్రి క్రిష్టప్ప, కుటుంబసభ్యులను హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ప్రతినిధులు కలసి నేత్రదానం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. మరణానంతరం మరో ఇద్దరికి కంటి చూపును ఇవ్వడం ద్వారా తమ కుమారుడు జీవించే ఉంటాడని భావించిన తల్లిదండ్రులు... పవన్‌కుమార్ నేత్రాలను దానం చేసేందుకు సుముఖత వ్యక్తం చేశారు. దీంతో మృతుడి శరీరం నుంచి నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ప్రతినిధులు సేకరించి, ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేతలు దేవేంద్ర, మంజునాథరెడ్డి, గంగాధర్ తదితరులు పవన్‌కుమార్ కుటుంబసభ్యులను అభినందించారు.



పవన్ కుటుంబసభ్యులకు సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

నలుగురికి రిమాండ్

గార్లదిన్నె: నవ వధువును ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. గార్లదిన్నె ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపిన మేరకు.... మండల పరిధిలోని పాత కల్లూరులో గత నెల 26న నవవధువు ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే.బుధవారం ఎస్ఐ మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ మూడు నెలలు కూడా గడవక ముందే భర్త లోకేష్, అత్త ఈశ్వరమ్మ, మామ మల్లికార్జున, మరిది మహేంద్ర వేధింపులు తాళలేక ఫిబ్రవరి 26న పూజిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. దేవేంద్ర ఫిర్యాదు మేరకు లోకేష్, ఈశ్వరమ్మ, మల్లికార్జున మహేంద్రపై కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం ఉదయం కల్లూరులో నిందితులను గుర్తించి అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచారు. అనంతరం న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

క్లుప్తంగా

మంచి పుస్తకం జీవన నేస్తం



పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ కే. హుస్సేన్ రెడ్డి

అనంతపురం: మంచి పుస్తకం జీవన నేస్తంగా ఉపయోగపడుతుందని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ కే. హుస్సేన్ రెడ్డి అన్నారు. వర్సిటీ సోషియాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ జీవీ రమణ, డాక్టర్ చింతపాటి గౌరీ సంయుక్తంగా రచించిన 'కౌమార బాలికల్లో పాలీ సిస్టక్ ఓవరీస్ సిండ్రోమ్ (పీసీఓఎస్) ప్రమాద కారకాల పట్ల జ్ఞానం- వైఖరి-ఒక అధ్యయనం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పుస్తక రచయిలతో పాటు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, పాలకమండలి సభ్యుడు ప్రొఫెసర్ మునినారాయణప్ప, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చాగంటి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి, ఖాళీ జాగా పన్ను వసూలు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని వివిధ డివిజన్ల పరిధిలో ఇంటి, ఖాళీ జాగా పన్ను రూ.31 లక్షలు వసూలైంది. కమిషనర్ మేఘస్వరూప్ ఆదేశాలతో అదనపు కమిషనర్ శ్రీహరిబాబు పర్యవేక్షణలో ఆర్ఓలు సతీష్, సుజాత, ఆర్ఐలు మురళీ, వేణు, బాబు, పద్మావతి తదితరులు బుధవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పన్ను వసూలుకు సంబంధించి ఇంటి పన్ను రూ.29 లక్షలు, ఖాళీ జాగా పన్ను రూ.2 లక్షలు వసూలైంది.

హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శన ప్రారంభం



హస్తకళా వస్తువులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అనంతపురం కల్చరల్: హస్తకళాకారులను ప్రోత్సహించాలన్న ప్రభుత్వ సూచనల మేరకు జిల్లా కేంద్రంలోని లేపాక్షి ఎంపోరియంలో ఐదురోజుల పాటూ హస్తకళా ప్రదర్శనను ఏర్పాటు చేశారు. బుధవారం లేపాక్షి ఎంపోరియం శ్రీనివాసులు హస్తకళా ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంప్రదాయ చేనేత హస్తకళలను ఆదరించడానికి వివిధ ప్రాంతాల సంస్కృతికి అద్దం పట్టే కళా వస్తువుల ప్రదర్శన, అమ్మకాలను డిస్కౌంటు ధరలతో విక్రయిస్తున్నట్లు తెలిపారు. హస్తకళాకారులను ఆదరించడం ద్వారా మన సంస్కృతీ సంప్రదాయాలకు గౌరవం దక్కుతుందన్నారు. ఏటికొప్పాక, నిమ్మలకుంట తదితర ప్రాంతాల నుండి అద్భుత నైపుణ్యంతో చేసిన వస్తువుల ప్రదర్శన ఉంటుందన్నారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సురేష్, కాటమయ్య, అమర్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి సమీపంలో పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు.. బుధవారం మామిళ్లపల్లి సమీపంలోని వ్యవసాయ పొలాల్లోని పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.17,100 స్వాధీనం చేసుకున్నారు. పేకాట, మట్కా, అక్రమ మద్యం విక్రయాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

ఆదర్శ ఇంజినీర్ 'శ్రీ రామకృష్ణయ్య'



నివాళులర్పిస్తున్న అనంత హక్కుల పోరాట సంఘం నాయకులు

అనంతపురం సెంట్రల్: క్షామ పీడిత ప్రాంతమైన రాయలసీమను సస్యశ్యామలం చేయడానికి కృషి చేసిన మహనీయుడు శ్రీ రామకృష్ణయ్య అని పలువురు సీమ ఉద్యమకారులు కొనియాడారు. బుధవారం శ్రీ రామకృష్ణయ్య వర్ధంతి సందర్భంగా ప్రభుత్వాసుపత్రి రోడ్డులోని ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఆనాడే హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని కొనియాడారు. ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. 60 టీఎంసీల నికర జలాలు తీసుకొచ్చి ఆయకట్టుకు ఇవ్వాలన్నారు. కరువు, వలసలు, ఆత్మహత్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో జన చైతన్య వేదిక నాయకులు రామాంజినేయులు, అనంత హక్కుల పోరాట సమితి నాయకులు సోమర రాహుల్, వీరేంద్ర, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు. టుటుట

టీడీపీ మాయలో పడొద్దు

- హామీలు ఇచ్చి, మోసం చేసిన ఘనత చంద్రబాబుదే
- పథకాలన్నీ అందాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించండి
- జగన్‌తోనే సంక్షేమ పాలన సాధ్యం
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 28వ డివిజన్‌లో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'



వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: 2014 ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టోను లేకుండా చేశారు. ముఖ్యంగా డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చెప్పి మహిళా సంఘాలు డీఫాల్టర్ల జాబితాలోకి వెళ్లేలా చేశారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నగరంలోని 28వ డివిజన్ అశోక్‌నగర్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించారు. అనంతరం మాట్లాడుతూ.. నగరంలోని వివిధ డివిజన్లలో ప్రాధాన్యత క్రమంలో పెద్ద ఎత్తున రోడ్లు, కాలువ, కమ్యూనిటీ హాళ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మరోమారు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉండాలన్నారు. ముందుచూపుతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రూ.24 వేల కోట్ల డ్వాక్రా రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేశారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పాలన అందిస్తున్నట్లు గుర్తు చేశారు. గతంలో ఏ ప్రభుత్వమైనా ఈ తరహాలో సేవలందించిందా ఆలోచించుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం వర్తింపజేయడంలో వలంటీర్లు కీలకపాత్ర పోషించారన్నారు. ఉత్తమ సేవలందించిన వలంటీర్లపై కూడా టీడీపీ, జనసేన అక్కసు వెల్లగక్కారన్నారు. ప్రజలకు మేలు చేయాలని చూస్తున్న ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు కుమ్మక్కైయ్యాయన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, సైఫుల్లా బేగ్, శ్రీదేవి, టీటీడీ బోర్డు సభ్యులు అశ్వర్థ నాయక్, జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖర్ రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, కార్పొరేటర్లు భోగాతి జయమ్మ, కమల్‌భూషణ్, బాలాంజినేయులు, నాయకులు రవి, మన్నల సత్యనారాయణ, లింగాల రమేష్, గౌస్‌బేగ్, రాధాకృష్ణ, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, రామయ్య, జానీ, బాకే హబీబుల్లా, అమర్‌నాథ్ రెడ్డి, జావెద్, భారతి, పార్వతి, అంజలి, భానుమతి, శోభాబాయి, ఉష, రాధ పాల్గొన్నారు.

నేడు 27వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 27వ డివిజన్‌లో గురువారం ఉదయం 7 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డివిజన్‌లోని అశోక్‌నగర్ అలేఖ్య ఫంక్షన్ హాల్ నుంచి కార్యక్రమం మొదలవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలి రావాలన్నారు.

ఆత్మకూరులో టీడీపీకి ఎదురుదెబ్బ



ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ ఎంపీటీసీ శంకర్‌నారాయణ రెడ్డి, బి.యాలేరు గ్రామస్తులు

ఆత్మకూరు: మండలంలో టీడీపీకి షాక్ తగిలింది. మండలంలోని బి.యాలేరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ శంకర్ నారాయణరెడ్డి (చిన్నా) బుధవారం అనంతపురంలోని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ నారాయణరెడ్డితో పాటు మరో 20 కుటుంబాల వారికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో తలారి కర్రి చంద్రాయుడు, కురుబ విశ్వనాథ్, చాకలి ఈశ్వరయ్య, బదలాపురం పోతన్న, కమ్మరి పరమేశ్వరి, కమ్మరి అనిత, హరిజన వేపకుంట లింగన్న, హరిజన నల్లప్ప, హరిజన నాని, హరిజన కొరివి ఈశ్వరయ్య, వంశీ ఉన్నారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులైనట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగనన్న పార్టీలకు అతీతంగా ఎన్నో పథకాలను అందించారని తెలిపారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగనన్న అభివృద్ధి చేశారని కొనియాడారు. టీడీపీ నాయకులు, చంద్రబాబు నాయుడు ఇచ్చే మోసపూరిత హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

అనంతపురం కల్చరల్: నగరంలో కొలువైన ప్రాచీన పాతూరు విరూపాక్షేశ్వరుడి ఆలయ హుండీ కానుకల లెక్కింపు బుధవారం జరిగింది. ఎండోమెంటు ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఈఓ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో సాగిన హుండీ లెక్కింపులో ధర్మకర్తల మండలి సభ్యులు, భక్త సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ చైర్మన్ కలవల సతీష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈ ఏడాది ఆలయ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఫలితంగా గతం కన్నా ఆదాయం చాలా రెట్లు పెరిగిందన్నారు. గత ఏడాది కేవలం రూ.1.35 లక్షలు మాత్రమే హుండీ ఆదాయం రాగా.. ఈసారి రూ.2,59,001 ఆదాయం వచ్చిందన్నారు. ఆలయంలో భక్తులకు మరిన్ని వసతులు కల్పిస్తామన్నారు. పండుగలు, పర్వదినాలను మరింత ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

పౌష్టికాహారాన్ని వినియోగించుకోండి



ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ హేమలత

రాప్తాడు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందించడం జరుగుతోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హేమలత, నాగరత్న పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మరూరు, క్రిష్టాపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయా కేంద్రాల్లో అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ పోషణ కింద అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సిబ్బంది, పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి సిరి ధాన్యాలను తప్పక తీసుకోవాలన్నారు. సిరి ధాన్యాలను తినడం ద్వారా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మమత, సుశీలమ్మ, హెల్పర్స్, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి



మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వసంత బాబు

రాప్తాడు: నియోజకవర్గంలో ప్రశాంత ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలని రాప్తాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వసంత బాబు కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ సన్నద్ధత, సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలు అంత్యంత ప్రాధాన్యతతో కూడినవి అని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర ఎంత ఉందో రాజకీయ పార్టీల నుంచి కూడా అంతే సహకారం అవసరం ఉందన్నారు. నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు మధ్య ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిందని, పార్టీలకు సంబంధించిన గుర్తులు, రాజకీయ పార్టీల నేపథ్యంలో ఉన్న పర్సన్స్‌కు సంబంధించిన ఫొటోలను అన్ని కార్యాలయాలు, ప్రైవేటు, పబ్లిక్ ప్రదేశాల్లో తొలగించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌గా గుర్తింపబడిన ప్రతి కేంద్రంలో రెండు వెబ్ క్యామ్స్, మైక్రో అబ్జర్వర్‌ను నియమించినట్లు చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు, ఎన్నికల విధుల నిర్వహణకు సిబ్బందిని సన్నద్ధం చేశామన్నారు. సభలు, సమావేశాలు నిర్వహించాలనుకుంటే 48 గంటల ముందే అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో వ్యూయింగ్ బృందాలు నియోజకవర్గంలో పర్యటిస్తూ అభ్యర్థుల ఖర్చులపై నిఘా వేసి ఉంటాయన్నారు. అనంతరం ఆన్‌లైన్‌లో అనుమతులు పొందే వివిధ యాప్‌లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాజకీయ ప్రతినిధులకు వివరించారు. నియోజకవర్గంలోని ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన కొన్ని చోట్ల రాజకీయ పార్టీల పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్స్, జెండాలు తొలగించడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆరు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోండి

- కమిషనర్ మేఘ స్వరూప్



బిందెల కాలనీ ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ మేఘ స్వరూప్

అనంతపురం కార్పొరేషన్: పారిశుధ్యం మెరుగుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కమిషనర్ మేఘ స్వరూప్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నగరంలోని బిందెలవారి కాలనీలో కమిషనర్ పర్యటించారు. బిందెలవారి కాలనీలో మురుగు సమస్య తగ్గతోందని, పూర్తి స్థాయిలో మురుగు నిల్వ లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైతే జేసీబీ లేదా సేవేజ్ పంప్ ద్వారా మురుగు నిల్వ లేకుండా చూడాలన్నారు. నిర్లక్ష్యం వీడి అప్రమత్తంగా ఉండాలని పారిశుధ్యం విభాగం సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

పార్కుల్లో ఆహ్లాదకరమైన వాతావరణం

నగరంలోని వివిధ పార్కుల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. రాంనగర్‌లోని నీరు ప్రగతి వనం, హౌసింగ్ బోర్డులోని రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్‌ను కమిషనర్ పరిశీలించారు. మొక్కలను సంరక్షించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం అశోక్‌నగర్ ప్రధాన రోడ్డు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలన్నారు. ఏఈ తప్పనిసరిగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పనులు జరిగే సమయంలో ప్రతి ఒక్క అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ..రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. క్వాలిటీ కంట్రోల్ నివేదిక తప్పనిసరిగా ఉండాలన్నారు.

ఘనంగా రేణుకా యల్లమ్మ గ్రామోత్సవం



వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ అనంతపురం ఎంపీ అభ్యర్థి శంకర నారాయణ

అనంతపురం కల్చరల్: గ్రామీణ ప్రాంతాలను తలపిస్తూ స్థానిక ఉమానగర్‌లోని కురుబల ఆరాధ్యదైవం చంద్రగుత్తి రేణుకా యల్లమ్మ తల్లి సాక మహోత్సవం బుధవారం వైభవంగా సాగింది. సంప్రదాయ కళారూపాల ప్రదర్శన, అమ్మవారికి సమర్పించిన బోనాలు, అమ్మవారి నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నదానం జరిగింది. వేడుకల్లో పెనుకొండ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అనంతపురం ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకర నారాయణ, మాలగుండ్ల రవీంద్ర, జిల్లా కురుబ సంఘం అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులు తదితరులు పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారి తీర్థప్రసాదాలందుకున్నారు. మహిమ గల అమ్మవారిగా పూజలందుకునే రేణుకాయల్లమ్మ తల్లి జాతర మహోత్సవం అందరిని ఐక్యంగా ఉంచుతుందన్నారు. అనంతరం పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తజన సందోహం నడుమ అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు హారతులు పట్టి భక్తి నీరాజనాలర్పించారు.

23న లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవం



అలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి

బొమ్మనహాళ్: మండలంలోని ఉప్పరహాళ్ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఉత్సవం ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. యేటా మాఘమాసంలో జరిగే ఈ ఉత్సవాలు ముందుగా మండలంలోని ఉద్దేహాళ్ వద్ద వేదావతి నదిలోనూ , అనంతరం ఉప్పరహాళ్ ఆలయం వద్దను జరుగుతాయి. రెండు గ్రామాల భక్తులు ఆనందోత్సాహంగా ఉత్సవాలను జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకోగా ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వాహకులు తెలిపారు.

తాటాకు బుట్టల్లో లక్ష్మీనరసింహస్వామి..

బొమ్మనహాళ్ మండలం ఉప్పరహాళ్‌లో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆకృతి లేకుండా తాటాకు బుట్టల్లో ఉండి భక్తులకు దర్శనమిస్తారు. వందలాది యేళ్ల నుంచి ఆచారంగా వజ్రకరూరు మండలం పందికుంటకు చెందిన భక్తులు యేటా నూతన తాటాకు బుట్టలను అల్లుకుని తెస్తారు. స్వామివారిని ఉప్పరహాళ్ నుంచి ఉద్దేహాళ్ వద్ద గల వేదావతి హగరి నదిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెలిమిలో గురువులు పాత బుట్టల నుంచి కొత్త బుట్టలలోనికి రహస్యంగా మారుస్తారు. అనంతరం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ఊరేగింపుగా సరిహద్దుదారి గుండా ఉప్పరహాళ్ దేవాలయానికి చేరుస్తారు. ఈ నేపథ్యంలో హగరి వద్ద , ఉప్పరహాళ్ దేవాలయం వద్ద స్వామి ఊరేగింపు సందర్భంగా అనేక మంది యువకులు , స్త్రీలు, రోగాల నయం కోసం, సంతానం కోసం కొర్కెలు తీర్చుకునేందుకు బోర్లా పడుకుంటారు. వారిపై స్వామివారు నడుచుకుంటూ ఆలయానికి చేరుకుంటారు.

ముత్యాల పల్లకీలో మద్దానేశ్వరుడు



మద్దానేశ్వర స్వామిని ముత్యాల పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

రాయదుర్గం రూరల్: మద్దానేశ్వరుడు ముత్యాల పల్లకీలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని 74 ఉడేగోళం గ్రామ సమీపంలో వెలసిన మద్దానేశ్వర స్వామి రథోత్సవం, పశువుల జాతరలో భాగంగా ముత్యాల పల్లకీ ఉత్సవం , లంకాదహన కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ముత్యాల పల్లకీ రథంలో స్వామివారిని అత్యంత వైభవంగా ఊరేగించారు. వందలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. పల్లకీ ఉత్సవం అనంతరం లంకాదహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంతో ఆలయ కమిటీ అధ్యక్షుడు బసవరాజు, సర్పంచ్ దురుగమ్మ, అన్నదాన కమిటీ అధ్యక్షుడు జయన్న, మహానందీశ్వర, ధరణేష్, కూల్ డ్రింక్ అప్పాజీ, గోవిందప్ప, ఉలుగప్ప, ఉపసర్పంచ్ రామకృష్ణారెడ్డి, ఆయతపల్లి జనార్దన, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గార్లదిన్నె: మండల కేంద్రంలో 44వ జాతీయ రహదారిపై విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. అనంతపురము నుంచి తల్లీకుమారుడు రామాంజినమ్మ, సాంబశివ బైక్‌పై పామిడికి బయలుదేరారు. విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు రాగానే వెనుకల నుంచి టిప్పర్ ఢీకొనడంతో తల్లి,కుమారుడికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రులను గార్లదిన్నె పీహెచ్‌సీకి తరలించారు.

తాతార్యారూఢ స్వామి తిరునాల ప్రారంభం



అలంకరణలో తాతార్యా రూఢ స్వామి

గార్లదిన్నె: మర్తాడులో బుధవారం తాతార్యా రూఢ స్వామి తిరునాల ప్రారంభమైంది. మొదటి రోజు వేద పండితుల నడుమ స్వామివారికి ధ్వజారోహణ, మహాన్యా సపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. గురువారం గంగ పూజ, కలశ స్థాపన, రుద్రయజ్ఞం స్వామి వారికి ఆలయ ధర్మకర్త ఆదినారాయణ పట్టు వస్త్రాల సమర్పణ, సహస్ర బిల్వార్చన, రాత్రి 10 గంటలకు స్వామివారి పుష్ప రథోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

భక్తిశ్రద్ధలతో నిజపాద స్పర్శ దర్శనం



అలంకరణలో రుక్మిణీ పాండురంగ విఠల స్వామి

అనంతపురం కల్చరల్: భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో స్థానిక రామనగర్‌లోని రుక్మిణీ పాండురంగ విఠల స్వామి ఆలయంలో బుధవారం నిజరూప పాదదర్శన పూజలు సాగాయి. ఆమలక ఏకాదశి సందర్భంగా జరిగిన పాదదర్శన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులే స్వయంగా స్వామి విగ్రహాలను తాకి ప్రత్యేక పూజలు చేయడానికి ఏర్పాట్లు చేయడంతో ఉదయం నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి ఆరాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రతి ఏకాదశికి స్వామికి నిజరూప పాద స్పర్శ సేవలు జరుగుతాయన్నారు. భక్తులు స్వయంగా స్వామిని తాకి ఆశీర్వాదం అందుకునే అవకాశాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. అంతకు ముందు ఆలయంలో అర్చనలు, పుష్పాలంకార సేవలు జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు దుస్తకర్ తిరుపతిరావు, సెక్రటరీ ఆనంద్ మహేంద్రకర్ తదితరులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై చెన్నకేశవుడు

యాడికి: మండల కేంద్రంలో బుధవారం రాత్రి శివలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చెన్నకేశవుడు సింహవాహనంపై భక్తులకు దర్శన మిచ్చాడు. ఉదయం ఆలయ అర్చకుడు హరికృష్ణ శర్మ చెన్నకేశవ స్వామి వారికి ఉత్సవ హోమ కార్యం, అభిషేకార్చనలు తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 10 గంటల సమయంలో శ్రీదేవి,భూదేవి సమేత శివలక్ష్మీ చెన్నకేవవ స్వామికి సింహవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు నాగరాజు, వెంకటనాయుడు భూపాళం హరినారాయణ, భూపాళం నాగ పుల్లయ్య, భూపాళం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.